# నైమిష

నైమిష ఒక బ్యాంకులో కంప్యూటర్ ఆపరేటర్‌గా జాబ్ చేస్తోంది. ఓ రోజు హైదరాబాద్‌లో వున్న తన అక్క నుంచి ఒక ఉత్తరం వచ్చింది. తను ఆపదలో వున్నట్టు తనను నలుగురు వంచించి దారుణంగా నాశనం చేశారని.

సరీగ్గా అదే సమయానికి హైదరాబాద్ చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ నుంచి ట్రంకాల్ వచ్చింది. అది విని నైమిష షాక్ అయిపోయింది. తన అక్క చనిపోయిందన్న వార్తను తనింకా నమ్మలేకపోతోంది. హడావుడిగా అప్పటికప్పుడు బయలుదేరి హైదరాబాద్ వెళ్ళింది.

అక్కడ అనుకోకుండా తన శత్రువులు పన్నిన వలలో ఇరుక్కుపోయి జైలుపాలైంది.

జైలు నుంచి విడుదలై తిరిగి ఉద్యోగంలో చేరేందుకు వచ్చింది నైమిష. కాని అప్పటికే ఆ జాబ్ మరొకరికి ఇవ్వబడింది.

నైమిష ఖిన్నురాలైపోయింది. అప్పుడిక తన పాత ఉద్యోగం తనకే ఇవ్వమని ప్రాధేయపడి ప్రయోజనం లేదనుకుంది. తాను బ్యాంకులో పనిచేసిన కాలానికి తన ఎకౌంట్‌లో వున్న ప్రావిడెంట్ ఫండ్, ఇన్స్యూరెన్స్ అన్నీ కలిపితే 67,565-65 అవుతాయి.

నైమిష వాటికోసం అప్లికేషన్ పెట్టింది. ఆ సాయంత్రానికే బ్యాంకు నుంచి మెసేజ్ వచ్చింది. బ్యాంక్ రూల్స్ ప్రకారం క్రిమినల్ కేసులపై శిక్షింపబడ్డవాళ్ళ బ్యాలన్సుల్ని జప్తు చేసి జనరల్ ఫండ్ ఎకౌంట్‌కి బదిలీచేయడం జరుగుతుందని.

నైమిష రక్తం ఆవేశంతో పరవళ్లు తొక్కింది.

ఎలాగైనా తనకు రావలసిన ఆ డబ్బును బ్యాంకు నుంచే రాబట్టేయాలనుకుంది.

మరుసటి రోజు మారువేషంలో వెళ్ళి ఎప్పుడూ బ్యాంకుకు రాని ఓ కస్టమర్ సంతకం ఫోర్జరీచేసి దాన్నే ఆథరైజేషన్‌గా చూపించి ఫాతిమాఅనే పేరుతో ఎకౌంట్ ఓపెన్ చేసింది.

ఆ బ్యాంకులో కంప్యూటర్ ద్వారానే డబ్బును డిపాజిట్ చేయటం, ట్రాన్స్‌ఫర్ చేయటం లాంటి పనులు నిర్వర్తిస్తున్నారు.

నైమిష ఆ బ్యాంకు పక్కనే వున్న కంప్యూటర్ అమ్మే షాపులోకి వెళ్ళింది. తాను ఒక కంప్యూటర్‌ని కొనడానికి వచ్చినదానిలా ఆ షాపువార్ని నమ్మించగలిగింది.

ఆ షాపులోని కంప్యూటర్ ద్వారా బ్యాంక్‌లోని మాస్టర్ కంప్యూటర్‌ని కంట్రోల్ చేయాలనే ప్లాన్ చేసుకుంది.

బ్యాంకులోని కంప్యూటర్‌కి ఒక ఆథరైజేషన్ కోడ్, ఒక యాక్సెస్ కోడ్ వుంటుంది. అది తెలియకపోతే ఆ కంప్యూటర్‌ని ఆపరేట్




చేయడం కష్టం. మోసాలు జరిగే అవకాశం వుందని బ్యాంక్‌లో మేనేజర్ రోజుకో కోడ్ ప్రవేశపెడతాడు. ఆ రెండూ కరెక్ట్‌గా చెబితేనే మాస్టర్ కంప్యూటర్ ఆ లావాదేవీల్ని అంగీకరిస్తుంది. డిస్క్ మోడల్ కంప్యూటర్ ముందు కెళ్లి నిలబడింది. నైమిష కంప్యూటర్‌ని పలకరించడం చాలా తేలిక. కేవలం ఒక బటన్ నొక్కితే 'హలో' అనే అక్షరాలు ప్రత్యక్ష మవుతాయి. వెంటనే రెండు కోడ్స్ చెప్పకపోతే కంప్యూటర్ దానంతట అదే ఆఫ్ అయిపోతుంది.

నైమిష తన అనుభవాన్ని ఓ సారి నెమరు వేసుకొని కంప్యూటర్ ఆన్ చేసింది.

కొద్ది క్షణాల మౌనం తర్వాత తెరపై అక్షరాలు ప్రత్యక్షమయ్యాయి. యువర్ ఆథరైజేషన్ ప్లీజ్ అని.

ఆటమ్-10 అని టైప్ చేసింది.

సూర్యదేవర రామమోహన్‌రావు

అది సరియైన కోడ్ కాదని కంప్యూటర్ ఆఫ్ అయింది. మేనేజర్ కోడ్ మార్చి వుంటారనిపించింది నైమిషకు.

తన బ్రాంచ్ మేనేజర్ కోడ్స్ మార్చే విధానం గుర్తుకు తెచ్చుకుంది నైమిష. ఆయన సీజన్స్ పేర్లు మారుస్తుంటాడు.

అంతే... ఆమె వేళ్ళు వేగంగా పనిచేశాయి మరలా తెరమీద.

యువర్ ఆథరైజేషన్ ప్లీజ్ అని వచ్చింది.

వింటర్-10 అని టైప్ చేసింది. అది ఇంప్రోపర్ అని తిరిగి సమాధానం వచ్చింది.

ఇంకెక్కువ సేపు అక్కడుండడం ప్రమాదం.

మరలా ఆమె వేళ్ళు పనిచేశాయి.

స్ప్రింగ్-10 అని టైప్ చేసింది.

అప్పుడు ఆమె ప్రయత్నం ఫలించింది.

తెరపై "ప్లీజ్ ప్రొసీడ్" అనే అక్షరాలు ప్రత్యక్ష మయ్యాయి. ఆమె కళ్ళు మెరిశాయి.

ఆమె టైప్ చేయసాగింది. **'Domestic, money transaction**

వెంటనే తెరపై ఒక చార్ట్ ప్రత్యక్షమయింది.

**Do you wish to...?** అని

నైమిష ట్రాన్స్‌ఫర్ అని టైప్ చేసింది.

తెరపై వెంటనే ఎంత మొత్తం? ఎక్కడికి? ఎక్కడి నుంచి అని ప్రత్యక్ష మయ్యాయి.

నైమిష వేళ్ళు మరలా పనిచేశాయి.

ఫ్రమ్ జెనరల్ రిజర్వ్ ఫండ్ టు ఫాతిమా ఎకౌంట్ అని. ఆమె తలుచుకుంటే ఎంతైనా ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు. కాని ఆమె అలా చేయలేదు. కరెక్టుగా తనకు రావలసిన ఎమౌంటే టైప్ చేసింది.

'ట్రాన్సేక్షన్ కంప్లీటెడ్' అని తెరపై కనిపించింది.

నైమిష ఆ షాప్ నుంచి సరాసరి బ్యాంక్‌కు వెళ్ళి తన ఎకౌంట్‌లో క్రెడిట్ అయిన మొత్తాన్ని డ్రా చేసుకుంది.

నిశ్శబ్దంగా బయటకు నడిచింది.

(ఇటీవలే విడుదలయిన సూర్యదేవర రామమోహన్‌రావు డైరెక్ట్ నవలలోని ఓ చిన్న కథ ఇది)